క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్‌ను అడ్డుకున్న రైతులు



పెన్నానదిలో ట్రాక్టర్‌ను అడ్డుకున్న రైతులు

రొద్దం: మండల పరిధిలోని చిన్నకోడిపల్లి-కందకూర్లపల్లి గ్రామాల మధ్య పెన్నానది పరివాహక ప్రాంతం నుంచి ఆదివారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను ఆ గ్రామ రైతులు అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా రాత్రి వేళ అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను అడ్డుకున్నట్లు రైతులు పేర్కొన్నారు. పెద్దకోడిపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రాత్రి వేళ ఇసుక అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారని రైతులు ఆరోపించారు. పెన్నానది నుంచి ఇసుక పెద్ద ఎత్తున అక్రమంగా తరలుతున్నా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని వాపోయారు. ఇసుక తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం ఇచ్చినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

గోరంట్ల: జిల్లా వ్యాప్తంగా ఈనెల 14, 15, 16 తేదీల్లో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ సూచన మేరకు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ తెలిపారు. ఇందులో భాగంగానే మండలస్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో పంచాయతీరాజ్, విద్యుత్, ఇరిగేషన్, రక్షిత మంచినీటి, వైద్యారోగ్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్యాధికారులు వారం రోజుల్లోపు ప్రసవం జరిగే గర్భిణులను గుర్తించి , వారికి సరైన వైద్యా సేవలు అందించాలన్నారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి, పంట, నష్టం జరగకుండా అన్ని శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మారుతితో , ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని జింక మృతి



చిలమత్తూరు: మండలంలోని 44వ నంబరు జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్ట్ సమీపంలోని జువారీ ఫ్యాక్టరీ వద్ద ద్విచక్ర వాహనం ఢీకొని జింక మృతి చెందింది. ఆదివారం మధ్యాహ్నం జింక జాతీయ రహదారి దాటే క్రమంలో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో జింక అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఫారెస్ట్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని జింక మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

అగళి: మండలంలోని అక్రమ కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చెసి రిమాండ్‌కు పంపినట్లు ఏఎస్‌ఐ శ్రీరాములు తెలిపారు. పీ బ్యాడగేరకు చెందిన వన్నేశప్ప దగ్గర 25 బాటిళ్లు, తొనసనపల్లి నాగరాజు వద్ద 30 , గ్యారగొండనపల్లి హనుమంతరాయప్ప వద్ద 25 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిని అదుపులోకి తీసుకొని న్యాయమూర్తి ఆదేశాలమేరకు రిమాండ్‌కు తరలించామన్నారు. అదేవిధంగా నలుగురు బాల కార్మికులను గుర్తించి వారు పాఠశాలలకు వెళ్లేలా తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు.

సమ సమాజ స్థాపనకు కృషి



పాస్టర్లను సన్మానిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలోని సీఅండ్‌జీ మిషన్ కాంపౌండ్ చర్చిలో పాస్టర్స్ అప్రిషియేషన్ డే, పాస్టర్ల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సిలోన్ అండ్ జనరల్ మిషన్ (సీఅండ్‌జీ మిషన్) చైర్మన్ త్యాగరాజు, మిషన్ కార్యదర్శి జెంబమిన్ తిమోతి, వైస్ చైర్మన్ ఐజయ్య హాజరయ్యారు. వారు మాట్లాడుతూ 'నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించు' అన్న ఏసుక్రీస్తు బోధనలను అనుసరించి సమ సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ తమవంతు పాత్ర పోషించాలని సూచించారు. అనంతరం పాస్టర్లను సన్మానించారు. కార్యక్రమంలో సంఘ పాస్టర్ స్టీఫెన్ రాజ్, సెక్రటరీ డాక్టర్ నాగేంద్ర కుమార్, సాల్మన్‌రాజ్, డీకెన్ బోర్డు సభ్యులు దేవరాజ్, జార్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

అగళి: మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆదివారం పెనుకొండ ఆర్డీఓ టీ.ఆనంద్‌కుమార్ సందర్శించారు. ఆర్డీఓ టి.ఆనందకుమార్ మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని తహసీల్దార్ సుబ్బారావుకు సూచించారు. అత్యవసర సహాయార్థం సెల్ నంబర్ 9948808499కు ఫోన్ చేయాలన్నారు.

సంబరంగా దసరా

- వివిధ రూపాల్లో దర్శనమిచ్చిన అమ్మవార్లు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- శమీ వృక్షాల వద్ద ప్రత్యేక పూజలు
- గ్రామోత్సవాలతో అన్నిచోట్లా సందడి

దసరా ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో విజయదశమి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు, గ్రామోత్సవాలు నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



నీలకంఠాపురంలో కోలాటమాడుతున్న మహిళలు



పావగడ తాలూకా నిడుగల్‌లో గ్రామ దేవతల ఊరేగింపు

హిందూపురం: దసరా పండుగ సందర్భంగా పట్టణ ప్రజలు ఆలయాలు, శమీవృక్షం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పేట వేంకటరమణ స్వామి, గుడ్డం రంగనాథస్వామి, చౌడేశ్వరీదేవి, శివాలయం, ఆంజనేయస్వామి, కొల్లపురమ్మ ఆలయాల్లో ఉత్సవ మూర్తులను ఊరేగించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో వాసవీ మాత, దుర్గాదేవి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి వాహనంపై పురవీధుల గుండా ఊరేగించారు. అలాగే కంసాలపేట చౌడేశ్వరీదేవి, జలదుర్గమ్మ, త్యాగరాజనగర్ శివాలయం, ఎల్లమ్మదేవి అమ్మవార్లను కూడా ఊరేగించారు. అమ్మవార్ల ఉత్సవమూర్తుల నగరోత్సవం అనంతరం కోనేరులో నిమజ్జనం చేశారు.

లేపాక్షి: పర్యాటక కేంద్రమైన లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయంలో దసరా ఉత్సవాలు ముగిశాయి. దుర్గాదేవి అమ్మవారిని మహిషాసురమర్దిని అలంకరణలో అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అలాగే చోళసముద్రంలో చౌడేశ్వరిదేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు.

పెనుకొండ: దసరా వేడుకల్లో భాగంగా పట్టణంలో శనివారం సాయంత్రం అమ్మవార్ల విగ్రహాలను ఘనంగా ఊరేగించారు. కన్యకా పరమేశ్వరి, మహంకాళి, వేంకటేశ్వరస్వామి, షిర్డీసాయిబాబా, కొల్హాపురమ్మ తదితర విగ్రహాలను పట్టణంలో ఊరేగించారు.

గుడిబండ: దసరా ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఉత్సవ మూర్తులను ఘనంగా ఊరేగించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే సీసీ గిరి గ్రామంలో వెలసిన మూలమ్మ, మద్దెమ్మలకు పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడ్ పూజల్లో పాల్గొన్నారు.



లేపాక్షి: మహిషాసుర మర్దిని అలంకరణలో కొలువైన దుర్గాదేవి



రొద్దం: రాజరాజేశ్వరిగా దర్శనమిస్తున్న రేణుకా యల్లమ్మ

అమరాపురం: మండలంలో దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. చోళమాంబదేవి, శ్రీదేవి, ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథాలపై ఊరేగించారు. అలాగే మండలంలోని తమ్మడేపల్లి ఆంజనేయస్వామి, హేమావతి సిద్దేశ్వరస్వామి ఆలయంలో దసరా ఉత్సవాలు జరిగాయి.

గోరంట్ల: పట్టణములోని చౌడేశ్వరీదేవి, మల్లాలమ్మ, కన్యకపరమేశ్వరీ దేవాలయాల్లో విజయదశమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి మండల కేంద్రంలో ఊరేగించారు.



మడకశిర మండలం జమ్మానిపల్లిలో లక్ష్మీనిడి మామిడమ్మ ఉత్సవమూర్తిని ఊరేగిస్తున్న దృశ్యం



కాళీమాత అలంకరణలో గంగమ్మ



హిందూపురం: మోడల్ కాలనీలో గంగమ్మదేవి

రొద్దం: మండల వ్యాప్తంగా విజయదశమి వేడుకలను వాడవాడలా నిర్వహించారు. పెద్దాంజనేయస్వామి దేవాలయం వద్ద శ్రీరామభక్త మండలి ఆధ్వర్యంలో దసరా వేడుకలు జరిగాయి. సీతారాముల ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. రొద్దకాంబదేవి ఆలయ అవరణంలో ఏర్పాటు చేసిన చిన్నారుల చెక్కభజన ఆకట్టుకుంది.



నీలకంఠాపురంలో మాజీ మంత్రి రఘువీరా జంబు సవారీ

మడకశిరరూరల్: మండలంలో దసరా వేడుకలను అన్ని వర్గాల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ముఖ్యంగా నీలకంఠాపురంలో మాజీ మంత్రి రఘువీరారెడ్డి కుటుంబ సభ్యులు ఎద్దుల బండ్లపై ఆలయం వరకు జంబు సవారీ చేశారు. పూజల అనంతరం మహిళల కోలాటం అందరినీ ఆకట్టుకుంది. జమ్మానిపల్లిలో లక్ష్మీనిడి మామిడమ్మ, ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తులను ఊరేగించారు.

పావగడ: అత్యంత ప్రసిద్ధి చెందిన పావగడ దసరా ఉత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. పట్టణంలోని గురుభవన్ మైదానంలో శమీ వృక్షం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం పట్టణంలో చౌడమ్మ, మారెమ్మ, కన్యకా పరమేశ్వరీ, శని మహాత్మ తదితర స్వామివార్ల ప్రత్యేకంగా అలంకరించి వాహనాలపై కొలువుదీర్చి ఊరేగించారు.



గుడిబండ: ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



గుడిబండ: భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఊరేగింపు



అమరాపురం: చోళమాంబదేవిని ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు



చోళసముద్రంలో చౌడేశ్వరిదేవిని ఊరేగిస్తున్న గ్రామపెద్దలు



హిందూపురం: పేటవెంకటరమణస్వామి పల్లకీ ఉత్సవం



హిందూపురం: కరికాంబికా అమ్మవారికి జ్యోతులు మోస్తున్న మహిళలు



రొద్దం: సీతారాముల విగ్రహాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



గోరంట్ల: మండల కేంద్రంలో అమ్మవార్ల విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

నేడు అగ్నిగుండ మహోత్సవం

అగళి: మండల పరిధిలోని మధుడి వీరభద్రస్వామి అలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం వీరభద్రస్వామి అగ్నిగుండం మహోత్సవాన్ని నిర్వహిస్తునట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం రథోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. కర్ణాటక రాష్ట్రంతో పాటు ఉమ్మడి అనంతపురం జిల్లా నలుమూల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఉత్సవానికి హాజరవుతారని పేర్కొన్నారు.



అలంకరణలో మధుడి వీరభద్రస్వామి

లేపాక్షిలో పర్యాటకుల సందడి



నంది విగ్రహం వద్ద పర్యాటకుల సందడి

లేపాక్షి: ప్రముఖ పర్యాటక కేంద్రమైన లేపాక్షి దేవాలయంలో పర్యాటకులు సందడి చేశారు. దసరా పండుగ ముగియడం, ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి వచ్చిన పర్యాటకులతో ఆలయం కిక్కిరిసిపోయింది. వీరభద్రస్వామి, దుర్గాదేవి అమ్మవార్లకు విశేషంగా పూజలు చేశారు.



పర్యాటకులతో కిక్కిరిసిన ఆలయ పరిసరాలు

చెరువులన్నీ నీటితో నింపండి

హిందూపురం/హిందూపురం టౌన్: మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు నీరు విడుదల చేసి హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని చెరువులు నింపాలని జలసాధన సమితి నాయకులు బీసీ సంక్షేమం, చేనేత జౌళిశాఖ మంత్రి సవితమ్మకు వినతిపత్రం అందించారు. హిందూపురం ఆస్పత్రికి విచ్చేసిన మంత్రిని కలిసి జలసాధన సమితి సభ్యులు కలిసి గొల్లపల్లి రిజర్వాయర్‌లో 1.10 టీఎంసీల నీరు నిలువ ఉన్నప్పటికీ మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు నీరు వదలడం లేదన్నారు. వర్షాల వల్ల కాలువలు పూడికతో పేరుకుపోయి కంపచెట్లతో నిండి నీరు ప్రవహించడానికి అడ్డంకిగా మారిందన్నారు. బ్రాంచ్ కెనాల్ కాలువల్లో నీరు ప్రవహించడానికి కాల్వ పూడిక తీసి కంప చెట్లను తొలగించాలన్నారు. హంద్రీనీవా కాలువ ద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లాలో 3 లక్షలా 45 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించాల్సి ఉండగా కేవలం 200 చెరువులకు మాత్రమే నీరు నింపుతున్నారన్నారు. అలాగే మడకశిర బ్రాంచ్ కెనాల్ కింద 265 చెరువులకు నింపాల్సి ఉండగా కేవలం 35 -40 చెరువులు మాత్రమే నింపుతున్నారని వాపోయారు. హంద్రీనీవా మెయిన్ కాలువ, మడకశిర బ్రాంచ్ కెనాల్ కాలువ వెడల్పు చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి సవిత స్పందిస్తూ మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు నీరు విడుదల చేయడానికి కాలువ పూడికతీత పనులు పూర్తి చేసి, త్వరలోనే చెరువులకు నీరు అందిస్తామన్నారు. కాలువ వెడల్పు పనుల విషయాన్ని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో జలసాధన సమితి అధ్యక్షుడు ధనాపురం వెంకట్రామిరెడ్డి, ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు. రైతు సంఘం నాయకులు సిద్ధారెడ్డి పరిగి నవీన్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సవితమ్మకు వినతిపత్రం అందిస్తున్న జలసాధన సమితి

నేటి నుంచి యత్తప్పస్వామి ఉత్సవాలు

రొళ్ల: మండల పరిధిలోని గంతికల్లుగొల్లహట్టి గ్రామంలో వెలసిన యాదవుల ఆరాధ్య దేవుడు యత్తప్ప స్వామి ఉత్సవాలు సోమవారం నుంచి శుక్రవారం వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈమేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈనెల 17న జరిగే పాలు పోసే పండగ ఉత్సవం ప్రత్యేకమన్నారు.

హోరాహోరీగా క్రికెట్ మ్యాచులు



4 వికెట్లు తీసిన బౌలర్ లోక్‌నాథ్



67 పరుగులు చేసిన కార్తీక్



51 పరుగులు చేసిన తేజేశ్వర్‌రెడ్డి

ధర్మవరం రూరల్: స్థానిక ఆర్డీటీ క్రీడా మైదానంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రూరల్ క్రికెట్ లీగ్ హోరాహోరీగా జరిగాయి. ఆదివారం నార్పల అండర్-15 బాలుర జట్టు, ధర్మవరం అండర్-15 బాలుర జట్టు తలపడ్డాయి. టాస్ గెలిసి బ్యాటింగ్‌కు దిగిన ధర్మవరం జట్టు 40 ఓవర్లలో తొమ్మిది వికెట్లకు 211 పరుగులు చేసింది. ధర్మవరం జట్టులోని కార్తీక్ 67 పరుగులు, తేజ 53 పరుగులతో సత్తా చాటారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నార్పల జట్టు 32.4 ఓవర్లలో 170 పరుగులకు ఆలౌట్ అయ్యింది. నార్పల జట్టులోని చిరంజీవి 51 పరుగులు చేశాడు. నార్పల జట్టులోని బౌలర్ సాయి 4 వికెట్లు, ధర్మవరం జట్టులోని లోక్‌నాథ్ 4 వికెట్లు, సాంబ 3 వికెట్లు సాధించి తమ సత్తా చాటారని కోచ్ రాజశేఖర్ తెలిపారు.

భూ సమస్యలు పరిష్కరించండి

- ఆర్డీఓ ఆనంద్‌కుమార్



రొళ్ల: సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఆర్డీఓ టీ.ఆనంద్‌కుమార్

రొళ్ల: గ్రామాల్లో రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం సిబ్బంది శ్రద్ధ తీసుకోవాలని పెనుకొండ డివిజన్ ఆర్డీఓ టీ.ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. తొలుత రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం కంప్యూటర్ గదిని పరిశీలించి పెండింగ్‌లో ఉంచకుండా ఆదాయం, కులధ్రువీకరణ పత్రాలను మంజూరు చేయాలన్నారు. తర్వాత ఇన్‌చార్జ్ తహసీల్దార్ భాగ్యలక్ష్మీతో కలిసి సిబ్బందితో సమీక్షించారు. ఆర్డీఓ టీ.ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ డైక్లాట్ ఆధారంగా రైతుల భూసమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సర్వే, సబ్ డివిజన్ వంటివి పెండింగ్‌లో ఉంచకుండా పూర్తిస్థాయిలో రికార్డులు తయారు చేసి పట్టదారు పాసుపుస్తకాల మంజూరు కోసం పంపాలన్నారు. అలాగే పట్టదారు పాసుపుస్తకంలో రైతుల పేర్లు మార్పులు, మ్యూటేషన్ వంటివి పెండింగ్‌లో ఉంచకూడదన్నారు.

గుడిబండ: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని పెనుకొండ ఆర్డీఓ ఆనందకుమార్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను తనిఖీ చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ తహసీల్దార్ రాంభూపాల్‌తో పాటు సిబ్బందికి సూచించారు.

భక్తిశ్రద్ధలతో గురు బీరలింగేశ్వరస్వామి జాతర



గురు బీరలింగేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

అగళి: మండల పరిధిలోని కోమరేపల్లిలో వెలసిన గురు బీరలింగేశ్వర స్వామికి జాతర శనివారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ విగ్రహన్ని మేళతాళాలతో పాలభావి వద్దకు తీసుకువెళ్లి గంగాజలంతో శుభ్రం చేసి ఉయ్యాల స్తంభం వద్ద పట్టంపై కూర్చోబెట్టారు. అనంతరం ప్రత్యేక పూజలు చేయగా భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

అధ్వానంగా మారిన రహదారి



తిమ్మాపురం వద్ద అధ్వానంగా మారిన రహదారి

పెనుకొండ: పెనుకొండ నగర పంచాయితీ పరిధిలోని తిమ్మాపురం వద్ద పాత హైవే అధ్వాన్నంగా మారింది. రోడ్డు గుంతలు పడి ఏ వాహనం ఎక్కడ నుంచి పోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. రోజూ వాహన చోదకులు నరకం చవి చూస్తున్నారు. రోజూ 500 లకు పైగా వాహనాలు ఈ రహదారి గుండా వెళ్తుంటాయి. అయితే రోడ్డు అధ్వానంగా మారడంతో ఏ క్షణంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని సర్వత్రా ఆందోళన నెలకొంది. అధికారులు తగిన చర్యలు తీసుకుని రోడ్డుకు మరమ్మతు చేయించాలని ప్రజలు, ప్రయాణికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

హిందూపురం: పట్టణానికి చెందిన శ్రీరాములు అనే యువకుడు ఆదివారం ఒంటిపై పెట్రోల్‌పోసుకొని చిన్న మార్కెట్ సర్కిల్లో ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు యత్నించినట్లు సమాచారం. వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

రొద్దం: మండల కేంద్రంలో పెన్నానది ఒడ్డున నిర్మిస్తున్న రొద్దకాంబదేవి ఆలయ నిర్మాణానికి హిందూపురానికి చెందిన భక్తుడు సింగిరెడ్డిపల్లి డి.శ్రీనివాసులు రూ 10,116 వేలు విరాళం అందజేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.